ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 26 జూన్ 2024

రాజీనామా యోచనలో ఏయూ వీసీ?
» కుర్చీని వీడకుంటే గతంలో వ్యవహారాలు ఎక్కడ వెలికితీస్తారనే ఆందోళనలో ప్రసాదరెడ్డి
» ఆయన బాటలోనే మరో కీలక అధికారి
» గడచిన ఐదేళ్లు వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారని ఉప కులపతిపై విమర్శలు



- వార్త 7వ పేజీలో..

రోడ్లు, వంతెనలకు మహర్దశ!

కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

» మరమ్మతు పనులపై అధికారులు ప్రతిపాదనలు

» వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం

» తాజా పరిస్థితులపై ప్రజల్లో ఆనందం



వడ్డాది వద్ద కూలిన వంతెన

చోడవరం, జూన్ 25:

వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గంలోని రహదారులు, కూలిన, కుంగిన వంతెనలను అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతంలో ఐదేళ్లలో ప్రజలు పడిన రహదారి కష్టాలు తీరే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికలు రూపొందించే పనిలో నిమగ్నం కావడంతో రోడ్లు, వంతెనలు బాగుపడే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత ఐదేళ్లలో బీఎన్ రోడ్డు అభివృద్ధికి న్యూ డెవలప్‌మెంట్ పథకం కింద నియోజకవర్గంలో గంధవరం నుంచి రోలుగుంట వరకు 45 కిలోమీటర్ల మేర ప్రధార రహదారి అభివృద్ధికి మంజూరైన రూ.113 కోట్లతో చేపట్టిన పనులకు వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసింది. తీవ్ర జాప్యం తరువాత చివరి రెండేళ్లలో పనులు ప్రారంభించినా, ఆ చేసిన పనులకు కూడా బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో బీఎన్ రోడ్డు పూర్తిగా అధ్వాన స్థితికి చేరిపోయింది. చివరకు ఎన్నికలు వచ్చేసరికి ప్రజాగ్రహం దెబ్బకొడుతుందని భావించిన అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ సొంత నిధులతో కొంతమేర రోడ్డుపై పూతలు వేసి ప్రజల్లో అసంతృప్తిని చల్లార్చడానికి ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. అధ్వానంగా మారిన బీఎన్ రోడ్డు పరిస్థితి ఇప్పటికీ దయనీయంగానే ఉంది. అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తదితరులు రహదారులపై ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు వంతెనల పరిస్థితిపై కూడా ఏం చేయాలనేదానిపై ప్రణాళిక రూపొందించినట్టు సమాచారం. ఈ మేరకు తొలుత చోడవరం నుంచి రోలుగుంట వరకు బాగా దెబ్బతిన్న రోడ్డు గుంతలు పూడ్చి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే రాజు, అధికారులు కూడా చోడవరం నుంచి రావికమతం రోలుగుంట వరకు ప్రధాన రహదారిని పరిశీలించి ఎక్కడ ముందుగా మరమ్మతు పనులు చేపట్టాలనేదానిపై ఒక నిర్ణయానికి వచ్చారు.



అధ్వానంగా ఉన్న వడ్డాది- కొత్తకోట ప్రధాన రహదారి

ఆర్ అండ్ బీ అధికారుల ప్రతిపాదనలు

బీఎన్ రోడ్డులో యుద్ధప్రాతిపదికన చేపట్టవలసిన మరమ్మతు పనులకు సంబంధించి ప్రతిపాదనలను ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నతాధికారులకు పంపించినట్టు తెలిసింది. తొలుత బాగా దెబ్బతిన్న చోట వెంటనే మరమ్మతు చేపట్టేలా, మిగిలిన రోడ్డు అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో పూర్తిచేసేందుకు ప్రభుత్వపరంగా అనుమతులు వచ్చేలా చూస్తామని ఎంపీ సీఎం రమేశ్.. ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశం సందర్భంగా వెల్లడించినట్టు చెబుతున్నారు. దీంతో అధికారులు ... మిగతా 8వ పేజీలో

పేట అభివృద్ధికి సహకరించండి

ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫిర్యాదుల పెట్టె

» ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి

» అవినీతి, అక్రమాలకు తావు ఉండకూడదు

» అధికారులు పనితీరు మార్చుకోవాలి

» సమీక్ష సమావేశంలో హోం మంత్రి వి.అనిత



మాట్లాడుతున్న హోం మంత్రి వి.అనిత

పాయకరావుపేట, జూన్ 25: ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేసి పాయకరావుపేటను అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లేందుకు అధికారులు సహకరించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. మంగళవారం స్థానిక పంచాయతీరాజ్‌శాఖ అతిథి గృహంలో పాయకరావుపేట నియోజకవర్గస్థాయి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేస్తామని, వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కరించాలన్నారు. పరిష్కారంకాని సమస్య ఏదీ ఉండదని, అధికారులు తమ వద్దకు వచ్చిన సమస్యలు ఏవిధంగా పరిష్కరించాలో సలహా ఇస్తే దానిపై తాను దృష్టిపెడతానన్నారు. అధికారులు పనితీరు మార్చుకుని, అవినీతి అక్రమాలకు తావులేకుండా పని చేయాన్నారు. శాఖల పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా పనిచేయాలన్నారు. అన్ని శాఖల ప్రక్షాళన, గంజాయి నిర్మూలన ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని ఇక్కడి నుంచే ప్రారంభిస్తానని ఆమె తెలిపారు. అనంతరం మంత్రి ప్రభుత్వ శాఖలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో నాలుగు మండలాల పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, వ్యవసాయం, విద్యుత్, వెలుగు, సాంఘిక సంక్షేమం, ఫిషరీస్, ఐసీడీఎస్, హార్టీకల్చర్, అటవీ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై హోం మంత్రి అసంతృప్తి

హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం పాయకరావుపేటలోని పంచాయతీరాజ్ గెస్టు హౌస్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశ హాల్లో ఏసీలు సరిగా పనిచేయకపోవడంతో స్థానిక ఎంపీడీవోపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పీఆర్ గెస్టు హౌస్‌ను అన్ని సౌకర్యాలతో కట్టించుకుని ఇప్పుడు తాను హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా అధికారులతో గెస్టు హౌస్‌లో సమావేశం నిర్వహిస్తే ఏసీలు పనిచేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇక నుంచి ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఎంపీడీవోను మంత్రి ఆదేశించారు.

డంపింగ్ యార్డు తరలింపుపై దృష్టి

దశాబ్దాల కాలంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు లభించనున్న ఊరట

» కూటమి ప్రభుత్వ హయాంలో కదలిక

» సాధ్యమైనంత త్వరగా తరలించాలని అధికారులకు ఎమ్మెల్యే కొణతాల ఆదేశం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లిలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో గల డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రంగం సిద్ధమవుతోంది. దశాబ్దాల కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఊరట లభించనుంది. ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పట్టణ నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం ప్రాంగణంలోనే డంపింగ్ యార్డు ఉండడం వల్ల ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాల కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చర్యలు చేపట్టారు. ఆయన సోమవారం డంపింగ్ యార్డును సందర్శించి అధికారులతో చర్చించారు. గతంలో పరిశీలించిన స్థలాల్లో ఎక్కడికైనా సాధ్యమైనంత త్వరగా డంపింగ్ యార్డును తరలించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు.



అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం ప్రాంగణంలోని చెత్త డంపింగ్ యార్డు

ఎట్టకేలకు కదలిక

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉండగా 2013 జూలై 31న అనకాపల్లి పురపాలక సంఘాన్ని విశాఖపట్నం జీవీఎంసీలో విలీనం చేశారు. 2022లో జిల్లాల పునర్విభజన జరిగినా ప్రస్తుతం అనకాపల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని 79 నుంచి 84 వరకు వార్డులు జీవీఎంసీ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ఐదు వార్డుల పరిధిలో సుమారు లక్ష మందికిపైగా జనాభా ఉంటున్నారు. మునిసిపాలిటీ పరిధిలో చెత్తను శారదా నదికి సమీపంలో శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఎన్నో ఏళ్లుగా నిల్వచేసేవారు. అదే స్థలంలో 2013 తరువాత జీవీఎంసీ అధికారులు డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని భావించారు. అయితే దీనిపై అప్పట్లో స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటకు సమీపంలో ప్రభుత్వ స్థలంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని అప్పట్లో యోచించారు. దీన్ని గ్రామస్థులంతా ముక్త కంఠంతో వ్యతిరేకించారు. గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా డంపింగ్ యార్డు ఎలా ఏర్పాటు చేస్తారంటూ గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. దీని వల్ల ఆ ప్రతిపాదనను అధికారులు విరమించుకున్నారు. తరువాత కొండకొప్పాక సమీపంలోని ఏలేరు కాలువ, రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న స్థలాన్ని ఎంపిక ... మిగతా 8వ పేజీలో

పెరుగుతున్న డయేరియా కేసులు

కడుపు నొప్పి, వాంతులతో బాధ పడుతున్న చిన్నారులు

» ఆస్పత్రులకు రోగుల తాకిడి

» జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



బాలుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డాక్టర్ వికాశ్

నర్సీపట్నం, జూన్ 25:

పట్టణంలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ఆస్పత్రులకు వచ్చే బాలల్లో 90 శాతం మందికి డయేరియా లక్షణాలే ఉంటున్నాయి. జ్వరం, తీవ్రమైన కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కడుపు నొప్పి వాంతులు వచ్చిన రెండు రోజులకు విరేచనాలు మొదలవుతున్నాయి. వాంతులు, కడుపు నొప్పి కారణంగా పిల్లలు నీరసించి పోతున్నారు.

నర్సీపట్నం చుట్టు పక్కల మండలాల నుంచి ప్రాంతీయ ఆస్పత్రికి ఎక్కువగా డయేరియా కేసులు వస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, కలుషిత తాగునీరు, స్ట్రీట్ ఫుడ్, బహిరంగ మల విసర్జన, అపారిశుధ్యం, తదితర కారణాలతో పిల్లలు డయేరియా లక్షణాలతో బాధ పడుతున్నారు. వైరల్ ఇన్ఫెక్షన్ ఉండడం వల్ల వాంతులు, కడుపు నొప్పి తగ్గడానికి ఎక్కువ రోజులు పడుతుందని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ బి.వికాశ్ చెప్పారు. ఆస్పత్రికి వస్తున్న చిన్న పిల్లలలో 60 శాతం మంది వాంతులు, కడుపు నొప్పితో బాధ పడుతున్నారని స్థానిక ప్రైవేటు ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ లక్ష్మీకాంత్ చెప్పారు. నర్సీపట్నం, చుట్టు పక్కల మండలాల నుంచి డయేరియా లక్షణాలతో చిన్నపిల్లలు అధికంగా వస్తున్నారని తెలిపారు. డయేరియా విజృంభించక ముందే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గొలుగొండ మండలం బుడ్డపాడు గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి యేసుబాబు వాంతులు, తీవ్రమైన జ్వరంతో బాధ పడుతుండడంతో తల్లిదండ్రులు ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. ఇన్ పేషెంట్ విభాగంలో యేసుబాబుకి వైద్యం చేస్తున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీ లక్ష్మీనగర్‌కి చెందిన గూడుప భాను స్వరూప్ తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. విరివిగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో జూలై మొదటి వారంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మెరుగైన పారిశుధ్యం, శుద్ధి చేసిన తాగునీరు సరఫరాకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్న పిల్లల వైద్యులు ఏమంటున్నారంటే..

పరిసరాల పరిశుభ్రతతో పాటు పిల్లలను శుభ్రంగా ఉంచడం చాలా అవసరమని సూచిస్తున్నారు. పిల్లలను బహిరంగ మల విసర్జనకు పంపడం వల్ల ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. వాంతులు, విరేచనాలు అవుతుంటే కాచి వడబోసిన నీరు, మజ్జిగ, బార్లీ, ఓఆర్ఎస్ వంటి లిక్విడ్స్ ఎక్కువగా తాగించాలని చెబుతున్నారు. తేలికగా జీర్ణం అయ్యే ఆహారం తీసుకోవాలని, మాంసాహారం, కారం తగ్గించాలని చెప్పారు. ముఖ్యంగా స్ట్రీట్ ఫుడ్ పూర్తిగా మానిపించాలని సూచించారు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా అవుతుంటే దగ్గరలో ఉన్న చిన్ని పిల్లల వైద్యులకు చూపించాలని తెలిపారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

» ఉదయం ఎండ, మధ్యాహ్నం వాన



అనకాపల్లిలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నిలిచిపోయిన వర్షపు నీరు

అనకాపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రుతు పవనాలు ఆరంభమైనా అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో పలు మండలాల్లో వాతావరణం చల్లబడింది. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతోంది. అనకాపల్లిలో మంగళవారం ఉదయం నుంచి ఎండ కాసినప్పటికీ మధ్యాహ్నం గంటసేపు వర్షం కురిసింది. మాడుగుల, సబ్బవరంలో ఒక మోస్తరు వర్షం కురవగా, అచ్యుతాపురంలో తేలికపాటి జల్లులు కురిశాయి. కొన్ని మండలాల్లో తేలికపాటి, మరికొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.

అయితే వాతావరణం చల్లబడినా కొద్దిసేపు మాత్రమే వర్షం కురవడంతో ఉక్కపోతతో జనం విలవిల్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరికొద్ది రోజులు కొనసాగితే రైతులకు ఎంతో లాభదాయకమని, వ్యవసాయ పనులు పూర్తి చేసుకొనే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ నిపుణులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,134 టీచర్ పోస్టులు ఖాళీలు

» స్కూల్ అసిస్టెంట్స్ కేటగిరీలో 583, ఎస్‌జీటీ 551

విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 1,134 ఖాళీలు ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో ఎస్‌జీటీ పోస్టులు 551, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీకి సంబంధించి 583 పోస్టులు ఉన్నట్టు పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో లాంగ్వేజ్-1 పోస్టులు 41, లాంగ్వేజ్-2 పోస్టులు 43, ఇంగ్లీష్ 59, గణితం 66, ఫిజికల్ సైన్స్ 74, బయాలజీ 62, సోషల్ స్టడీస్ 99, హిందీ 139 ఖాళీలు ఉన్నట్టు వెల్లడించింది. డీఎస్సీపై ప్రభుత్వం ప్రకటన చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే, ఈ వివరాలకు సంబంధించి జిల్లా విద్యా శాఖ ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు.

భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత

» ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో గుట్టలుగా తేలిన వైనం

» ఫార్మా, ఎన్టీపీసీ వ్యర్థ రసాయనాలు కలవడమే కారణమని మత్స్యకారుల ఆరోపణ



మృతి చెందిన చేపలు

పరవాడ, జూన్ 25: మండలంలోని ముత్యాలపాలెం ఉప్పుటేరులో మంగళవారం పెద్ద ఎత్తున చేపలు మృత్యువాత పడ్డాయి. ఫార్మాసిటీతో పాటు సింహాద్రి ఎన్టీపీసీ నుంచి వెలువడుతున్న వ్యర్థ రసాయనాలు నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కాగా తీరం వెంబడి మృతి చెందిన చేపలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా చేపలు చనిపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుటేరులో మృతి చెందిన చేపలను మాజీ ఎంపీపీలు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి



కుప్ప నూకరాజు, గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాలు

పాయకరావుపేట, జూన్ 25 : పాయకరావుపేట పట్టణంలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేటలోని ముస్లింవీధికి చెందిన కుప్ప నూకరాజు(36) అనే వ్యక్తి తాటి కల్లు తీసుకునేందుకు ఈనెల 15వ తేదీన పట్టణంలోని రైల్వే పట్టాల వద్ద ఉన్న తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనలతో నూకరాజును మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు వీధిలో మంగళవారం సుమారు 55 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి పేరు, ఇతర వివరాలు తెలియరాలేదని, దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామని ఎస్‌ఐ రామారావు తెలిపారు.

సిమెంట్ బస్తాల చోరీపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూన్ 25: మండలంలోని పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీ వద్ద జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణానికి సిద్ధం చేసిన సిమెంట్ బస్తాలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్టు సైట్ ఇన్‌చార్జి దాసరి అంజిబాబు సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ మహ్మద్ ఆలీ మంగళవారం తెలిపారు. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఒక షెడ్డులో ఉంచిన 30 సిమెంట్ బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్టు ఆయన తెలిపారు. కాగా ఆదివారం రాత్రే సిమెంట్ బస్తాలు చోరీకి గురవుతున్న విషయం తెలుసుకున్న గస్తీలో ఉన్న పోలీసులు సిమెంట్ బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. చోరీకి పాల్పడిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్టు సమాచారం.

నాలుగు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

గొలుగొండ, జూన్ 25: నాలుగు కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు. మంగళవారం బైక్‌పై ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి గంజాయిని తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సీతకండి గ్రామ సమీపంలో పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన మామిడి మణికంఠ, విజయవాడ అర్బన్‌కు చెందిన దాసరి వినయ్‌కుమార్‌లను అరెస్టు చేసి, బైక్, రెండు సెల్‌ఫోన్లు, గంజాయి స్వాధీనపర్చుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచినట్టు చెప్పారు.

వివాహితను ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం, జూన్ 25: పట్టణంలోని ప్రైవేటు లాడ్జిలో ఈనెల 24వ తేదీన వివాహిత చింతకాయల భాగ్యలక్ష్మి ఆత్మహత్యకు ప్రేరేపించిన పెదబొడ్డేపల్లి శ్రీరామ్‌నగర్‌కి చెందిన ఆకుల అజయ్‌కుమార్‌ని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. అయన్ని న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఆయన చెప్పారు.

78 కిలోల గంజాయి స్వాధీనం

రోలుగుంట, జూన్ 25 : మండలంలోని ఎంకేపట్నం పంచాయతీ పెదపేట గ్రామ గంగాలమ్మ గుడి వెనుక తోటల్లో మంగళవారం 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి అక్కడ నుంచి పారిపోతుండగా సిబ్బంది పట్టుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 4 గోనె సంచుల్లో ఉన్న 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనికి సంబంధం ఉన్న బీబీపట్నంకు చెందిన మోయ్యా జ్యోతి బాబు, ఎంకేపట్నంకు చెందిన సరమండ ఈశ్వరరావులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. అలాగే నిందితుల నుంచి ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అక్రమ కలప స్వాధీనం

కొయ్యూరు, జూన్ 25: రవాణాకు సిద్ధం చేసిన 44 కలప దుంగలను మంగళవారం అటవీ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 44 వేలు ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు పెదవలస రేంజ్ అధికారిణి శివరంజని ఆధ్వర్యంలో మంగళవారం చీడిపాలెం సరిహద్దులో రహస్య ప్రదేశంలో రవాణాకు సిద్ధం చేసిన 35 గన్నర దుంగలు, 9 వేగిస, 3 తడ, ఒక గుమ్మడి దుంగలను దుంగలు కనుగొన్నారు. వీటి విలువ రూ. 44 వేలు ఉంటుందని రేంజర్ తెలిపారు. ఈ దాడులలో కొయ్యూరు సెక్షన్ అధికారి నూకరాజు, కాకరపాడు బీట్ ఆఫీసర్ భూషణం, పలువురు ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి చేసిన ఇద్దరి అరెస్టు

పరవాడ, జూన్ 25: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీకి చెందిన దళిత మహిళ మట్టా యశోదపై సోమవారం కత్తితో దాడి చేసి గాయపరిచిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళిత మహిళ యశోద, సాయినగర్‌కాలనీకి చెందిన కంపర రమేశ్ ప్రేమించుకున్నారన్నారు. వీరికి పెళ్లి చేయడానికి రమేశ్ తండ్రి సత్యనారాయణ అంగీకరించలేదన్నారు. ఈ క్రమంలో సత్యనారాయణ, అతని కుమార్తె సియాద్రి భారతి కలిసి దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు వద్ద యశోదతో గొడవ పడి ఆమెపై కత్తితో దాడి చేసి గాయపరిచారని తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం కింద ఐపీసీ 307 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులిద్దరినీ బుధవారం అనకాపల్లి కోర్టులో హాజరుపరుస్తామని ఆయన వెల్లడించారు.

పెంపుడు కుక్క కరిచి తండ్రీకొడుకు మృతి

- తండ్రి ఆర్‌టీసీ కండక్టర్, కుమారుడు రైల్వే ఉద్యోగి

భీమునిపట్నం, జూన్ 25: ఇంట్లో పెంచుకుంటున్న కుక్క కరవడంతో నాలుగు రోజుల వ్యవధిలో తండ్రీకొడుకు మృతిచెందిన సంఘటన విశాఖ జిల్లా భీమిలిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని ఎగువపేటకు చెందిన అల్లిపిల్లి నరసింగరావు (59) ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భార్గవ్ (27) రైల్వేలో పనిచేస్తుండగా, కుమార్తెకు వివాహం చేశారు. వారు మూడేళ్లుగా ఇంట్లో కుక్కను పెంచుకుంటున్నారు. వారం క్రితం తండ్రీకొడుకు కుక్కతో ఆడుతుండగా అది కాస్తా కాటు వేసింది. భార్గవ్‌ను ముక్కు మీద, నరసింగరావును కాలిపై కరిచింది. పెంపుడు కుక్క కావడంతో వ్యాక్సిన్ వేయించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ సంఘటన జరిగిన రెండు రోజులకు ఆ కుక్క చనిపోవడంతో వారిద్దరూ యాంటీ రేబిస్ ఇంజక్షన్ చేయించుకున్నారు. అయితే అప్పటికే రాబిస్ వ్యాధి ప్రబలింది. గత శుక్రవారం సాయంత్రం భార్గవ్ ఆరోగ్యం క్షీణించడంతో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే పచ్చకామెర్లు పెరిగిపోవడం, లివర్, బ్రెయిన్ తదితర శరీర భాగాలకు రాబిస్ సోకడంతో ఆదేరోజు మృతిచెందాడు. నరసింగరావు మంగళవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. నాలుగు రోజుల వ్యవధిలో తండ్రీ కొడుకు చనిపోవడంతో ఎగువపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎగువపేట సేవా సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా నరసింగరావు...యువకులను, పిల్లలను విద్యలో ప్రోత్సహించడంతో పాటు గ్రామాభివృద్ధికి ఎంతో కృషిచేశారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

రాజీనామా యోచనలో ఏయూ వీసీ?

- కుర్చీని వీడకుంటే గతంలో వ్యవహారాలు ఎక్కడ వెలికితీస్తారనే ఆందోళనలో ప్రసాదరెడ్డి
- ఆయన బాటలోనే మరో కీలక అధికారి
- గడచిన ఐదేళ్లు వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారని ఉప కులపతిపై విమర్శలు
- క్యాంపస్‌లో వైసీపీ పెద్దల జన్మదిన వేడుకల నిర్వహణ

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి కుర్చీ దిగిపోయే సమయం ఆసన్నమైందంటున్నారు. రాజీనామా చేయాలని ఆయన యోచిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కుర్చీని వీడకుంటే క్రిమినల్ కేసులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, అందుకే ముందుగానే తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు, పదవీ విరమణ తరువాత కూడా కొనసాగుతున్న ఉన్నతాధికారులు ఒక్కొక్కరుగా రాజీనామాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పైరవీలు చేసి కొందరు విశ్వవిద్యాలయాల్లో కీలక పోస్టుల్లో తిష్ఠ వేశారు. వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. ఎన్నికల సమయంలో కూడా ఆ పార్టీ విజయం కోసం సర్వశక్తులూ వినియోగించారు. అటువంటి వారి జాబితాలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి ప్రథమ స్థానంలో ఉన్నారు. ఆయన యూనివర్సిటీని ఏకంగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ముందు ఆ పార్టీ జయాపజయాలపై విద్యార్థులతో సర్వేలు చేయించడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. యూనివర్సిటీ వేసిన ప్రతి అడుగులో వైసీపీ ఉందనేటట్టుగా ప్రచారం చేశారు. తన ఎజెండాను అమలు చేయడం కోసం కీలక పోస్టుల్లో అనుకూలురైన వారిని నియమించుకున్నారు. అంతా కలిసి నచ్చినట్టు చేశారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను, ఆ పార్టీకి చెందిన కుటుంబ సభ్యులను వేధించారు. ఒకటేమిటి?...ఏయూలో ఏకంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయించారు.

ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా విజయసాయిరెడ్డి ఉన్నప్పుడు జీవీఎంసీ ఎన్నికల్లో ప్రసాదరెడ్డే చక్రం తిప్పారు. అభ్యర్థుల ఎంపిక అంతా ఆయన చేతుల మీదుగానే జరిగింది. నామినేటెడ్ పోస్టులు కూడా ఆయన చెప్పిన వారికే ఇచ్చారు. మరోవైపు రాష్ట్రంలో వైసీపీకి చెందిన వారిని ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి రప్పించి వారికి అడ్డదారిలో పీహెచ్‌డీ పట్టాలు ఇప్పించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక వర్సిటీలో నిర్మాణాల పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశారు. వైసీపీ అండ చూసుకొని టీడీపీ నేతలపైనే నేరుగా విమర్శలు చేసి అందరి దృష్టిలో పడ్డారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలుకావడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటవ్వడంతో ఆ పదవిలో కొనసాగాలా?, లేక తప్పుకుంటే మంచిదా?... అని డోలాయమానంలో పడ్డారని విశ్వసనీయంగా తెలిసింది. ఆ సీట్లో కూర్చున్నా పాత వ్యవహారాలు అన్నీ తిరగదోడి క్రిమినల్ కేసులు పెట్టే అవకాశం ఉందని, పైగా అవమానాలు కూడా ఎదుర్కోనాల్సి వస్తుందనే ఉద్దేశంతో రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు మంగళవారం రాత్రి తెలిసింది. ఆయనతో పాటు రిజిస్ట్రార్‌ను కూడా రాజీనామా చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఆలయాల ట్రస్ట్ బోర్డులకు త్వరలో నోటిఫికేషన్

- పాత బోర్డులన్నీ రద్దయినట్టే..
- దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి



నక్కపల్లి, జూన్ 25: జిల్లాలో దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో వున్న పలు ఆలయాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ వస్తుందని, గత పాలక మండళ్లన్నీ ఇప్పుడు రద్దయినట్టేనని ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి తెలిపారు. మంగళవారం ఆమె నక్కపల్లిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే చాలా మంది స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారన్నారు. తమ పరిధిలో జిల్లాలో 6ఏ ఆలయాలు 3 వుండగా, 6బీ ఆలయాలు 25 వున్నాయని చెప్పారు. తమ కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే ఆలయాల్లో ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఆమె వెంట ఆ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రాజు, పాయకరావుపేట పాండురంగస్వామి దేవస్థానం ఈవో ఎస్.వెంకటాద్రి వున్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 25: గంజాయి నిర్మూలనకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళికతో పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన కేసులకు సంబంధించి అధికారులను ఆరాతీశారు. ఆయా కేసులు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని త్వరితగతిన దర్యాప్తు చేసేందుకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. అదేవిధంగా జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నివారణకు వంద రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, ఇతర రోడ్డు మార్గాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఎక్కువగా నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీలు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీలు

- ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు
- ఒకరికి షోకాజ్ నోటీసు జారీ



పురుషోత్తపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఎలమంచిలి, జూన్ 25: మండలంలోని పురుషోత్తపురం, పులపర్తి గ్రామాల్లోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుషోత్తపురం స్కూల్‌ను 9 గంటలకు సందర్శించగా నిర్దేశిత సమయానికి టీచర్లు అనురాధ, సుధారాణి రాకపోవడంతో వారికి మెమోలు జారీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఎస్ఏ ఇంజనీరింగ్ అధికారిని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి పలు సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పులపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ స్కూల్ తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండడంతో స్కూల్ హెచ్ఎం కె.శ్రీరామ్మూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు



బాల్యవివాహానికి సిద్ధపడిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్న సీడీపీవో లక్ష్మీదేవి

గూడెంకొత్తవీధి, జూన్ 25: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ బూరుగు పాకలు గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. వివాహానికి సిద్ధపడిన బాలబాలికల తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి కౌన్సెలింగ్ చేశారు. సీడీపీవో కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మొండిగెడ్డ పంచాయతీ బూరుగు పాకలు గ్రామానికి చెందిన బాలుడు (16), బాలిక (15) ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ నెల 30వ తేదీన వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వివాహ ఆహ్వాన పత్రికలు ముద్రించి పంపిణీ చేశారు. ఈ విషయం స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీస్ ద్వారా తెలుసుకున్న సీడీపీవో మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో చర్చించి ఇరువురు తల్లిదండ్రులను జీకేవీధి తీసుకొచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వం తీసుకునే చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. బాలబాలికలు ఇద్దరికి వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయరాదన్నారు. ఇరువురు తల్లిదండ్రులను బైండోవర్ చేసి గ్రామాలకు పంపించేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహిని, మహిళా పోలీస్ చినతల్లి, బాలల హక్కుల పరిరక్షణ ఫోరం మండల కన్వీనర్ సోమేశ్ కుమార్ పాల్గొన్నారు.

అగనంపూడి టోల్‌గేట్ ఎత్తేయాల్సిందే!

- ఎన్డీఏ కూటమి నాయకుల ఆందోళన
- స్టాపర్లను తొలగించిన కార్యకర్తలు
- వాహనాల నుంచి ఫీజు వసూళ్లను అడ్డుకున్న వైనం
- నేడు చర్చిద్దామని ఎన్‌హెచ్ఏఐ అధికారుల హామీ



టోల్‌గేటు వద్ద ఆందోళన చేపడుతున్న టీడీపీ, జనసేన నాయకులు

అగనంపూడి, జూన్ 25: నగర పరిధిలోని అగనంపూడి వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న టోల్‌గేటును ఎత్తివేయాల్సిందేనని టీడీపీ, జనసేన నాయకులు, శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్దకు పెద్దఎత్తున చేరుకున్న వారంతా ఆందోళనకు దిగారు. వాహనాలను నియంత్రించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్టాపర్లను తొలగించేశారు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదంటూ వాహనాలను పంపించేశారు. టోల్‌గేటు కొనసాగింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దేశేంద్ర మాట్లాడుతూ నగర పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా టోల్‌గేటును కొనసాగిస్తూ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో దానిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో 2019లో ఇక్కడి టోల్‌గేటును మూసివేశారని, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ తెరుచుకుని, దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టోల్‌గేటు కొనసాగడానికి వీల్లేదన్నారు. సుమారు గంటకుపైగా ఆందోళన కొనసాగిస్తుండడంతో అక్కడి సిబ్బంది విషయాన్ని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు బుధవారం టోల్‌గేటు వద్దకు వచ్చి చర్చిద్దామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మోటూరి వెంకటరమణ, గంతకోరు అప్పారావు, విందుల రాజు, కత్తి తిలక్, సింగిడి సింహాచలం, మాడిశ వెంకటరావు, దాసరి రమేశ్, గీత, మువ్వల మహేశ్, నూకరాజు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల దాడిపై పోలీసులకు ఫిర్యాదు

నాతవరం, జూన్ 25: వెదురుపల్లిలో వైసీపీ నాయకులు తనపై దాడి చేశారని గ్రామానికి చెందిన పోలుపర్తి రాజు అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెదురుపల్లి గ్రామంలో సర్వే నంబరు 112-5లో తన స్థలంలో పాక కడుతుండగా వైసీపీ నాయకుడు రెడ్డి అప్పలనాయుడుతోపాటు కొందరు ఈ స్థలం మాదంటూ దౌర్జన్యంగా వచ్చి కర్రలతో దాడి చేశారని పేర్కొంది.

ఈ దాడిలో తన సోదరి పోలుపర్తి రమణమ్మకు తీవ్ర గాయాలు కావడంతో నర్సీపట్నం ఆసుపత్రికి తరలించినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొంది. టీడీపీ అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకులు దౌర్జన్యాలు ఆగడం లేదని ఆమె పేర్కొంది.

హోం మంత్రి అనితకు అభినందనల వెల్లువ



హోం మంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నక్కపల్లి, జూన్ 25: హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి శుభాకాంక్షలు చెప్పేందుకు మంగళవారం ఉదయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉద్యోగులు, అధికారులు తరలివచ్చారు. సోమవారం రాత్రి అనిత నక్కపల్లికి సమీపంలో వున్న తన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలియడంతో కూటమి నాయకులతో పాటు పలు ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులు తరలిరావడంతో ఆమె నివాసం వద్ద సందడి కనిపించింది. దేవదాయ, ధర్మాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి, ఇన్‌స్పెక్టర్ రాజు, పీఆర్‌టీయూ జిల్లా ప్రతినిధులు గోపీనాథ్, డీవీఎస్ రావు, తోడపు వెంకట రమణ, ప్రగడ శివాజీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానశాఖ, పోలీస్‌శాఖాధికారులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు, వీఆర్‌ఏలు, కూడా ఆమెను కలిశారు. కాగా అనిత నివాసం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చిన వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

వైసీపీ కార్యాలయం వద్ద ఆందోళన

- కాపు సామాజిక భవనం కోసం కేటాయించిన స్థలంలో నిర్మించడంపై కూటమి శ్రేణుల నిరసన



వైసీపీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కూటమి శ్రేణులు

అనకాపల్లి రూరల్, జూన్ 25: కాపు సామాజిక భవనానికి కేటాయించిన స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయాన్ని నిర్మించడంపై కూటమి శ్రేణులు ఆందోళన చేశాయి. మండలంలోని కొత్తూరు నరసింగరావుపేటలో గత టీడీపీ ప్రభుత్వంలో కాపు సామాజిక భవనానికి కేటాయించిన స్థలంలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆందోళన చేశారు. తక్షణమే ఈ భవనాన్ని కాపు సామాజిక భవనానికి కేటాయించాలని కూటమి శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ ఆందోళన కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, సిరసపల్లి సన్యాసిరావు, కశిరెడ్డి సత్యనారాయణ, తలారి కాశీనాయుడు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

తాడి గ్రామంలో జడ్పీ పర్యటన

- గ్రామానికి సురక్షిత నీరు సరఫరా చేసేందుకు చర్యలు
- జోనల్ కమిషనర్, పీసీబీ ఈఈ వెల్లడి



గ్రామస్థులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, పీసీబీ ఈఈ ముకుందరావు

పరవాడ, జూన్ 25: ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామంలో మంగళవారం అనకాపల్లి జోనల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పీవీ ముకుందరావు పర్యటించారు. ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) తాడి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు అధికారులు గ్రామంలో పర్యటించి స్థానిక రక్షిత మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం నీటి నమూనాలను సేకరించారు. గ్రామానికి సురక్షితమైన తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు గ్రామస్థులకు తెలిపారు. కాగా గ్రామానికి తాగునీరుతో పాటు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, గ్రామాన్ని తరలించే వరకు ఎప్పటికప్పుడు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు కోరారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోమటి సూరిబాబు, కె. పైడిరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను సందర్శించిన ప్రత్యేక అధికారిణి

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కె.సంతపాలెం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగలక్ష్మి

కె.కోటపాడు, జూన్ 25 : మండలంలోని కె.సంతపాలెం, సూరెడ్డిపాలెంతో పాటు పలు సంపద కేంద్రాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారిణి ఈ. నాగలక్ష్మి, ఎంపీడీవో పట్నాయక్, పంచాయతీ విస్తరణ అధికారి వీవీఎస్. ప్రసాద్ తనిఖీ చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నిరుపయోగంగా సంపద కేంద్రాలు' శీర్షిన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. దీంతో మండలంలోని సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి మాట్లాడుతూ.. పంచాయతీ తీర్మాణాలు చేసి, చుట్టూ రక్షణ గోడలు వెంటనే నిర్మించాలని పంచాయతీ కార్యదర్శికి, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఇకపై ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

చినుకు పడితే.. అవస్థలే



కొత్తపేట ప్రధాన రోడ్డుపై వర్షం నిలిచిపోవడంతో వాహనదారుల ఇబ్బందులు

- ఎక్కడ పడితే అక్కడే నిలిచిపోతున్న వర్షం నీరు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎలమంచిలి, జూన్ 25 : పేరుకే మునిసిపాలిటీ.. చినుకు పడితే చాలు రోడ్లపైనే వర్షం నీరు నిలిచిపోవడం.. చిన్న గాలి వీస్తే ఇక అంతే... గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం వంటి ప్రధాన సమస్యలతో పట్టణ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎలమంచిలిలో మంగళవారం గంటకు పైగా కురిసిన వర్షానికి పలు చోట్ల రోడ్డపైనే వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులకు ఎప్పటిలాగానేఇబ్బందులు తప్పలేదు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. 3 గంటల నుంచి గంట పాటు కురిసిన వర్షంతో ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన జనానికి వర్షంతో ఉపశమనం పొందినట్లయింది. ఖరీఫ్ వ్యవసాయ సీజనుకు ముందు కురిసిన ఈ వర్షం ప్రారంభ పనులు చేపట్టేందుకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎలమంచిలిలో కురిసిన వర్షానికి మిలట్రీ కాలనీ, కొత్తపేట ప్రధాన రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు వద్ద వర్షం నీరు నిలిచిపోయింది. సుమారు రెండు గంటలు పాటు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఇదేమని అడిగితే.. వర్షం పడడంతో సమస్యలు ఏమైనా ఉన్నాయోమోనని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఏదేమైనా మునిసిపాలిటీలో ఎప్పటిలాగానే చినుకు పడితే చాలు రోడ్లపై నీరు నిలిచిపోయే దుస్థితి నుంచి పాలకులు, మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అనకాపల్లిలో వర్షం



తటాకాన్ని తలపిస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ

- ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిలిచిన వర్షం నీరు

అనకాపల్లి టౌన్, జూన్ 25 : అనకాపల్లిలో మంగళవారం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు 35.8 డిగ్రీల ఉష్ణోగ్రతతో అల్లాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కల్పించింది. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈ వర్షం కారణంగా రోడ్లపై పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో అనకాపల్లి-చోడవరం మార్గంలో వాహనచోదకుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ వర్షపునీటితో చెరువును తలపించింది. ఈ వర్షం కారణంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ప్రహరీ, చిన్న చెట్టు నేలకొరిగింది. అయితే ఆ సమయంలో ఎవరూ ఆ మార్గంలో రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎన్టీఆర్ వైద్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం రోడ్లపై వర్షపునీరు ఎక్కడిక్కడే నిలవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫ రా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఊరించి.. ఉసూరుమనిపించి...



ఉపమాకలో మేఘావృతమైన ఆకాశం

నక్కపల్లి, జూన్ 25 : నక్కపల్లి మండలంలో ఎండ తీవ్రతకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రజానీకం ఉక్కిరిబిక్కిరైంది. ఉక్కబోత, వడగాడ్పులకు ప్రజలు విలవిల్లాడారు. నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం హైవే జంక్షన్లతో పాటు గ్రామాల రహదారులు కూడా జనసంచారం లేక వెలవెలబోయాయి. అయితే, సాయంత్రం 4 గంటలకు ఒక్కసారిగా నింగిలోదట్టమైన మేఘాలు అలముకున్నాయి. కారుమబ్బులు వీచడంతో భారీ వర్షం పడుతుందని ప్రజలు ఎంతో ఆత్రంగా ఎదురుచూశారు. కానీ నిరాశే ఎదురైంది. ఊరించిన మేఘమాలిక ఉసూరమన్పించింది.



వేంపాడులో మధ్యాహ్నం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా వున్న హైవే జంక్షన్

రైలు ప్రయాణికుల సమస్యలపై సీపీఎం ధర్నా



అనకాపల్లి టౌన్ : ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నేతలు



యలమంచిలి : నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, జూన్ 25 : ఆధునీకరణ పేరుతో రద్దు చేసిన రైళ్లను తక్షణమే పునరుద్ధరించి రైలు ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వేస్టేషన్ వద్ద సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. విశాఖ నుంచి విజయవాడ మీదుగా రైళ్లను పునరుద్ధరించి సామాన్య ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లి స్టేషన్ మీదుగా పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వలస కార్మికులు వేలాది మంది ప్రయాణిస్తుంటారన్నారు. వీరికి అందుబాటులో ఉండే రైళ్లను రద్దు చేయడం వల్ల తీవ్ర ఆర్థికభారంతో పాటు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో సామాన్య ప్రజలు జనరల్ బోగీల్లో ప్రయాణించేవారని, ఆ బోగీలను రైల్వేశాఖ తగ్గించిందన్నారు. స్లీపర్ బోగీలను కూడా తగ్గించి ఏసీ బోగీలను పెంచడం వల్ల సామాన్య ప్రయాణికుల సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం దూరం చేసిందని ఆరోపించారు. తాజాగా ఆధునీకరణ పేరుతో విశాఖ నుంచి విజయవాడ వెళ్లే పలు రైళ్లను తరచూ నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎల్‌టీటీ, వందేభారత్ రైళ్లకు అనకాపల్లిలో హాల్ట్ లేకపోవడం విచారకరమన్నారు. అనంతరం స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, పెంటకోట శ్రీనివాసరావు, కె. తేలయ్యబాబు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి : ఆధునీకరణ పేరుతో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని మంగళవారం ఎలమంచిలి రైలు స్టేషన్ వద్ద సీపీఎం నేతలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖపట్నం నుంచి విజయవాడ మీదుగా వెళ్లే రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైళ్లతో పాటు సింహాద్రి, రత్నాచల్, మచిలీపట్నం, గూంటూరు రాయగడ, ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ రైల్వే స్టేషన్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కె.అప్పారావు, సోమునాయుడు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

ఎస్.రాయవరం : రైళ్లను ప్రైవేటీకరించాలన్న ఉద్దేశం నేపథ్యంలో క్రమంగా రైళ్ల సర్వీసులను రద్దు చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. ఆధునీకరణ పేరుతో రద్దు చేసిన రైళ్లు, అలాగే ఈ రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం సత్యనారాయణ, నాయకులు ఎం రాజేష్, కె ప్రసాద్, కె కాశీరావు, ఎం శ్రీను, రమణ, బైరాగిరావు, బాహూజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల అనుపోత్సవాలు



పూజలు చేస్తున్న సర్పంచ్ పార్వతి దంపతులు

సబ్బవరం, జూన్ 25 : మండలంలోని నల్లరేగులపాలెం, ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం గ్రామాల్లోని గ్రామ దేవతలు నల్లమారమ్మ తల్లి, దుర్గాలమ్మతల్లి అనుపోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం 6 గంటల నుంచే అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం కోలాటం, చిడతల బజనలు, నేల డ్యాన్స్‌లు, బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగించి, అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలు జరిగాయి. ఎంపీటీసీ రాపేటి అరుణ, సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, గ్రామ పెద్దలు రాపేటి రాము, సురేశ్‌రాజ్ దర్శించుకున్నారు.

హరిపురం పాల సంఘం అధ్యక్షుడిగా అప్పారావు ఏకగ్రీవం



మాజీ ఎమ్మెల్సీ పప్పలను కలిసిన అప్పారావు

రాంబిల్లి, జూన్ 25 : మండలంలోని హరిపురం పాల సంఘం నూతన అధ్యక్షుడిగా దూళి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాల ఉత్పత్తిదారుల సంఘం కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. గడువు తీరడంతో ఇద్దరు పాలక వర్గ సభ్యులు, అధ్యక్ష ఎన్నికను విశాఖ డెయిరీ జీవో పి.గురునాథరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బి.తాతయ్యబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట, జూన్ 25 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మంగళవారం పాయకరావుపేట విచ్చేశారు. ఆమెకు కూటమి నేతలు ఘనం స్వాగతం పలికారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గెస్టుహౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంట వేసే రైతులకు వరి విత్తనాలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మంత్రితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్, టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాలబాబు, వంకా వెంకటరమణ, చింతకాయల రాంబాబు, బొంది కాశీవిశ్వనాథంతో పాటు నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణితో అంగన్వాడీ నేతల భేటీ



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

అనకాపల్లి టౌన్, జూన్ 25 : రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు మంత్రికి బొకే ఇచ్చి సత్కరించారు. అలాగే పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.నాగోషు చెప్పారు.

భవిత కేంద్రాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్ఎస్ఏ కో-ఆర్డినేటర్ శకుంతల



సిబ్బందితో మాట్లాడుతున్న శకుంతల

అచ్యుతాపురం, జూన్ 25 : భవిత కేంద్రాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సర్వ శిక్ష అభియాన్ కో-ఆర్డినేటర్ శకుంతల అన్నారు. మంగళవారం ఆమె స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. కేంద్రాల్లో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారన్నారు. ఇక్కడ విద్యార్థులకు పుస్తకాలు, యూనీఫార్మ్‌తో పాటు రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. వారంలో ఐదు రోజులుభవిత కేంద్రాలు పని చేస్తాయని, ప్రతి శనివారం ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. అలాగే ప్రతి శనివారం ప్రత్యేక ఉపాధ్యాయులు తీవ్ర వైకల్యం గల దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తారని చెప్పారు. అందువల్ల దివ్యాంగులను విధిగా భవిత కేంద్రాల్లో చేర్చాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ఐఆర్‌పీలు జగదాంబ, శైలజ పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, జూన్ 25 : ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకర్‌రావు తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుల సమక్షంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేయనున్నట్టు తెలిపారు.



కోటవురట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

కోటవురట్లలో మోస్తరు వర్షం

కోటవురట్ల, జూన్ 25 : మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు తీవ్రమైన ఎండలతో అల్లాడిన ప్రజలకు ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. కోటవురట్ల, కైలాసపట్నం, రాజుపేట, చౌడువాడ. గొట్టివాడ, రామచంద్రపురంగ్రామాల్లో వర్షం కురిసింది. ఈ వర్షానికి రహదార్లు జలమయ్యాయి. ఈ వర్షం వరివిత్తనాలు వేసుకోవడానికి, కూరగాయల పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సబ్బవరంలో..



సబ్బవరంలో పడుతున్న వర్షం

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా కాస్తున్న తీవ్ర ఎండలకు మంగళవారం కురిసిన వర్షం ఊరట నిచ్చింది. అంతే కాకుండా వారం క్రితం వేసిన గంటి నాట్లుకు, ఇంకా వేయాల్సిన గంటి నాట్లుకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నారు పోసుకునేందుకు వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

రహదారులు జలమయం



రహదారిపై వర్షపు నీటి ప్రవాహం

కొత్తూరు, జూన్ 25 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్‌లో ప్రధాన రోడ్లు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతకు గురైన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి ఒక్కసారిగా సేదతీరారు. వాతావరణంలో చల్లని గాలులతో కూడిన వర్షం పడడంతో రోడ్లన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. సత్యనారాయణపురం గ్రామానికి వెళ్ళే దారిలో దొంగగెడ్డ వర్షం నీటితో నిండిపోయింది. అలాగే కొత్తూరు ప్రధాన రహదారిలో వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. వాతావరణం చల్లబడడంతో చిన్నారులు, ప్రజలు వేసవితాపం, ఉక్కపోత నుంచి బయటపడ్డారు.

విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న శ్రీనివాసరావు

కశింకోట, జూన్ 24 : మండలంలోని జట్టపురెడ్డితుని పంచాయతీ నర్సింగబిల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు చేతుల మీదుగా 30 మంది రైతులకు వరి విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు కరణం హేమలత, మాజీ సర్పంచ్ మజ్జి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ షేక్ దర్గా, సర్పంచ్ కోన అరుణ, మాజీ ఎంపీటీసీ మజ్జి నిరంజన్‌కుమార్, మజ్జి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

ఎలమంచిలి, జూన్ 25 : ఈ నెల 29న ఎలమంచిలి కోర్టు వద్ద జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని మండల న్యాయ సేవా అధికార సంఘం అధికారి పి.విజయ కోరారు. కోర్టులలో(ఎలమంచిలి) పెండింగ్‌లలో ఉన్న రాజీపడే సివిల్, క్రిమినల్ కేసులు కుటుంబ తగాదాలు, ప్రిలిటిగేషన్ కేసులు, బ్యాంకు అప్పు, టెలిఫోన్ బకాయిలు వంటి కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.

రోడ్లు, వంతెనలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రహదారి మరమ్మతుల పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

కూలిన వంతెనలపై దృష్టి

బీఎన్ రోడ్డులో ప్రధానంగా కూలిపోయిన వంతెనల స్థానంలో భారీ వంతెనల నిర్మాణానికి కూడా ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చోడవరం-నర్సీపట్నం రోడ్డులో మూడు వంతెనలు కూలిపోయాయి. ఇందులో ప్రధానంగా వడ్డాది వంతెన ఒకటి. వడ్డాది వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు అప్పట్లో వైసీపీ నేతలు హడావిడి చేసినా, ప్రభుత్వంనుంచి నిధులు రాకపోవడంతో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డుతో సరిపెట్టారు. ఇప్పటికీ వర్షాకాలం వస్తే ఈ వంతెనపై రాకపోకలు నిలిపివేయకతప్పని పరిస్థితి. ఇక ఇదే రూట్లో విజయరామరాజుపేట వద్ద ఏడాది క్రితం మరో వంతెన కూడా కూలిపోయింది. దీనికి ఇప్పటి వరకూ మోక్షం లేదు. బంగారుమెట్ట సమీపంలో మరో చిన్న వంతెన సైతం కూలిపోయింది. వంతెనలు కూలిపోవడంతో పాటు చోడవరం- వెంకన్నపాలెం రోడ్డులో కల్వర్టులు కూడా నేడో రేపో అన్న చందంగా మారిపోయాయి. అలాగే గోవాడ వంతెన కూడా శిథిల స్థితికి చేరుకుంది.



చోడవరం- వడ్డాది రోడ్డులో విజయరామరాజుపేట వద్ద కూలిపోయిన వంతెన

ఈ పరిస్థితుల్లో త్వరలో ఈ వంతెనలు పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్న పట్టుదలతో కూటమి నేతలు ఉన్నారు. ఇప్పటికే ఎన్‌డీబీ నిధులతో చేపట్టే పనుల్లో విజయరామరాజుపేట, చోడవరం-వెంకన్నపాలెం రూట్లో కల్వర్టులు ఉండడంతో ఈ వంతెనల నిర్మాణానికి ఎలాంటి ఢోకా ఉండదని, వడ్డాదిలో కూలిన వంతెన ఎన్‌డీబీ ప్రాజెక్టులో లేనందున ఆ ఒక్క వంతెనకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయవలసిన అవసరం ఉందని ఆర్ అండ్‌బీ అధికారులు అంటున్నారు. వడ్డాది వంతెన కు కూడా నిధులు మంజూరు చేస్తే బీ ఎన్ రోడ్డులో కూలిన వంతెనలు, శిథిల కల్వర్టులు అన్నీ ఒక్కొక్కటిగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత

... 5వ పేజీ తరువాయి

పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ తదితరులు పరిశీలించారు. ఫార్మా, ఎన్టీపీసీ యాజమాన్యాల నిర్వాకం కారణంగానే భారీ ఎత్తున మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందని వారు మండిపడ్డారు. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలేనికి చెందిన సుమారు 12 వేల మంది మత్స్యకారులు ఉప్పుటేరుపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ క్రమంలో ఇక్కడ భారీ ఎత్తున చేపలు చనిపోవడం దారుణమన్నారు. చేపల మృతికి కారణమైన ఫార్మాసిటీ, ఎన్టీపీసీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపించడంతో పాటు మత్స్యకారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లు చేపల మసేను, సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, కో-ఆప్షన్ సభ్యుడు ఘైలపల్లి అప్పన్న, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, నగిరెడ్డి చిన్నారావు, పలువురు మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



మృతి చెందిన చేపలను చూపిస్తున్న మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు తదితరులు

డంపింగ్ యార్డు తరలింపుపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

చేశారు. దీన్ని కూడా స్థానికులు వ్యతిరేకించారు. దీంతో చేసేది లేక ప్రతిరోజు ఖర్చుతో కూడుకున్నా, పట్టణానికి నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం ప్రాంగణంలోనే చెత్త డంపింగ్ యార్డును కొనసాగిస్తున్నారు.

పట్టణానికి నడిబొడ్డున డంపింగ్ యార్డు ఉండడంతో వర్షం కురిస్తే, పరిసరాల్లో జనావాసాలకు దుర్గంధం వెదజల్లుతోంది. డంపింగ్ యార్డు సమీపంలో నివాసితులు అనేక పర్యాయాలు తమకు ఎదురవుతున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. వైసీపీ ప్రభుత్వం పట్టణ ప్రజల అభ్యర్థన మేరకు 2023లో అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి ఆనుకొని వున్న సర్వే నంబర్లు 67, 68లోని ప్రభుత్వ జాగా సుమారు 20 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని భావించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు.

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు కాకముందే ఇచ్చిన మాట ప్రకారం ప్రజల ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డు తరలింపుపై చర్యలు చేపట్టడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

'నాసా' సేవలు అమోఘం
ఎంపీపీ లక్ష్మణమూర్తి



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, నాసా ప్రతినిధులు

నాతవరం, జూన్ 25 : అగ్ని ప్రమాద బాధితులను 'నాసా' సంస్థ ముందుకు వచ్చి ఆదుకోవడం అభినందనీయమని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం నాతవరంలో రెండు రోజుల క్రితం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో నాసా సంస్థ వారు అగ్ని ప్రమాద బాధితులు ముళ్ళ అమ్మన్న, ఊర్ల కన్నతల్లిలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, వంటపాత్రలను ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో జె.రాంబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నాసా సంస్థ వారు మండలంలో నిరుపేదలకు వివిధ రూపాల్లో సాయం అందిస్తున్నారని కొనియాడారు. అలాగే ప్రభుత్వం కూడా అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాసా సంస్థ మండల కో-ఆర్డినేటర్ తాటిపాక శ్రీను, మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు బంగారు సూరిబాబు, సామర్ల అప్పారావు, గంగరాజు పంచాయతీ కార్యదర్శి శ్రీను, నాసా సంస్థ ప్రతినిదులు నామా శ్రీను వాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్‌కు మరమ్మతులు



వంతెనపై రక్షణగా ఏర్పాటు చేసిన రెయిలింగ్

కృష్ణాదేవిపేట, జూన్ 25 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో ఉన్న వంతెన వద్ద రక్షణగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ ఎట్టకేలకు ఆర్అండ్ బీ అధికారులు మరమ్మతు చేపట్టారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'లో 'కృష్ణాదేవిపేట వంతెన రెయిలింగ్ కూలటంలో భయం...భయం' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో మంగళవారం కూలినగోడకు బదులుగా రెయిలింగ్ అనుకోని పూర్తిస్థాయిలో ఐరన్ ఊచలతో మరమ్మతు చేపట్టారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోతుల దారిలో గమ్యం చేరేదెలా?

మాకవరపాలెం, జూన్ 25 : మండలంలో జి.వెంకటాపురం రోడ్డు చెరువును తలిపిస్తుంది. రామన్నపాలెం సెంటరునుంచి జి.వెంకటాపురం వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తుంది. ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలకు ఈ గోతులు నీటితో నిండి చెరువుల్లా మారిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ రోజూ ఈ రోడ్డు ద్వారా చుట్టుపక్కల గ్రామాల నుంచి పదుల సంఖ్యలో పక్కనే ఉన్న పైనీయర్ కంపెనీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు పూర్తిగా గోతులతో ఉండటం, భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.


గోతులతో దర్శనమిస్తున్న జి.వెంకటాపురం రహదారి

తాగునీటి సమస్య పరిష్కరించండి
» అధికారులకు టీడీపీ నేతల వినతి


ఈవోపీఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

మాకవరపాలెం, జూన్ 25 : మండలంలో గత కొన్ని నెలలుగా తామరం శివారు కామేశ్వరినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకులు కోసూరు శ్రీనువాస్, వార్డు మెంబరు లోవ కుమారి ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామేశ్వరినగర్‌లో కొంత మందికి మాత్రమే కొళాయిల ద్వారా నీరు అందుతోందన్నారు. అయితే ఈ కాలనీలో ఉన్న రెండు వార్డులకు సంబంధించిన ప్రజలు టీడీపీ సానుభూతిపరులు కావడంతో ఇక్కడ ఉన్న వైసీపీకి చెందిన సర్పంచ్ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం పలుమార్లు వినతి చేసినప్పటికీ పంచాయతీపాలక వర్గంలో మాత్రం స్పందన లేదన్నారు.

కాలనీలో తాగునీరు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ వాసులకు అందరికీ కొళాయిల నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత

... 5వ పేజీ తరువాయి

పైలా జగన్నాథరావు, మానవరపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ తదితరులు పరిశీలించారు. ఫార్మా, ఎన్టీపీసీ యాజమాన్యాల నిర్వాకం కారణంగానే భారీ ఎత్తున మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందని వారు మండిపడ్డారు. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలేనికి చెందిన సుమారు 12 వేల మంది మత్స్యకారులు ఉప్పుటేరుపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ క్రమంలో ఇక్కడ భారీ ఎత్తున చేపలు చనిపోవడం దారుణమన్నారు. చేపల మృతికి కారణమైన ఫార్మాసిటీ, ఎన్టీపీసీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపించడంతో పాటు మత్స్యకారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లు చేపల మసేను, సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, కో-ఆప్షన్ సభ్యుడు షైలపల్లి అప్పన్న, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, నగిరెడ్డి చిన్నారావు, పలువురు మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.


మృతి చెందిన చేపలను చూపిస్తున్న మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు తదితరులు


రైన్‌కోట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుజాత, ఈవోపీఆర్డీ రమణి

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ

కృష్ణాదేవిపేట, జూన్ 25 : గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పది మంది పారిశుధ్య కార్మికులకు మంగళవారం రెయిన్‌కోట్లును అధికారులు, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ లోచల సుజాత, గొలుగొండ ఈవోపీఆర్డీ రమణి మాట్లాడుతూ వర్షాకాలంలో పారిశుధ్య కార్మికులు వర్షాలతో పారిశుధ్య పనులు చేయలేకపోతున్నారన్నారు.ఈ సమస్యను గుర్తించి వర్షాలకు ఇబ్బందులు పడకుండా పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంచాయతీ నిధుల నుంచి కొనుగోలు చేసి అందించినట్టు చెప్పారు. వీటిని పారిశుధ్య కార్మికులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ కార్యాక్రమంలో కార్యదర్శులు శ్రీనివాస్, రఘురామ్, రాజేశ్ పాల్గొన్నారు.

52 మందికి వైద్య పరీక్షలు



గొలుగొండ, జూన్ 25 : మండలంలోని పాత మల్లంపేట గ్రామ పంచాయతీలో శివారు బుడ్డడపాడు గ్రామంలో గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. బుడ్డడపాడు గ్రామంలో వైరల్, మలేరియా జ్వరాలు బారిన గ్రామస్తులు బాధపడుతున్నారు. దీంతో వైద్యశిబిరం నిర్వహించి 52 మందికి రక్త, వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్యాధికారి రోగులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేడినీళ్ల తీసుకోవాలని, జ్వరాలు వస్తే తక్షణం పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించి,ఫాగింగ్ మిషన్ వినియోగించడం, దోమల మందు చల్లినట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో వైద్యాధికారులు నర్సీపట్నం డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.జె.ప్రశాంతి, కీర్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, వంతెనలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రహదారి మరమ్మతుల పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

కూలిన వంతెనలపై దృష్టి

బీఎన్ రోడ్డులో ప్రధానంగా కూలిపోయిన వంతెనల స్థానంలో భారీ వంతెనల నిర్మాణానికి కూడా ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చోడవరం- నర్సీపట్నం రోడ్డులో మూడు వంతెనలు కూలిపోయాయి. ఇందులో ప్రధానంగా వడ్డాది వంతెన ఒకటి. వడ్డాది వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు అప్పట్లో వైసీపీ నేతలు హడావిడి చేసినా, ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డుతో సరిపెట్టారు. ఇప్పటికీ వర్షాకాలం వస్తే ఈ వంతెనపై రాకపోకలు నిలిపివేయకతప్పని పరిస్థితి. ఇక ఇదే రూట్లో విజయరామరాజుపేట వద్ద ఏడాది క్రితం మరో వంతెన కూడా కూలిపోయింది. దీనికి ఇప్పటి వరకూ మోక్షం లేదు. బంగారుమెట్ట సమీపంలో మరో చిన్న వంతెన సైతం కూలిపోయింది. వంతెనలు కూలిపోవడంతో పాటు చోడవరం- వెంకన్నపాలెం రోడ్డులో కల్వర్టులు కూడా నేడో రేపో అన్న చందంగా మారిపోయాయి. అలాగే గోవాడ వంతెన కూడా శిథిల స్థితికి చేరుకుంది. ఈ పరిస్థితుల్లో త్వరలో ఈ వంతెనలు పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్న పట్టుదలతో కూటమి నేతలు ఉన్నారు. ఇప్పటికే ఎన్‌డీబీ నిధులతో చేపట్టే పనుల్లో విజయరామరాజుపేట, చోడవరం- వెంకన్నపాలెం రూట్లో కల్వర్టులు ఉండడంతో ఈ వంతెనల నిర్మాణానికి ఎలాంటి ఢోకా ఉండదని, వడ్డాదిలో కూలిన వంతెన ఎన్‌డీబీ ప్రాజెక్టులో లేనందున ఆ ఒక్క వంతెనకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయవలసిన అవసరం ఉందని ఆర్ అండ్‌బీ అధికారులు అంటున్నారు. వడ్డాది వంతెనకు కూడా నిధులు మంజూరు చేస్తే బీ ఎన్ రోడ్డులో కూలిన వంతెనలు, శిథిల కల్వర్టులు అన్నీ ఒక్కొక్కటిగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.


చోడవరం- వడ్డాది రోడ్డులో విజయరామ రాజుపేట వద్ద కూలిపోయిన వంతెన

డంపింగ్ యార్డు తరలింపుపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

చేశారు. దీన్ని కూడా స్థానికులు వ్యతిరేకించారు. దీంతో చేసేది లేక ప్రతిరోజు ఖర్చుతో కూడుకున్నా, పట్టణానికి నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం ప్రాంగణంలోనే చెత్త డంపింగ్ యార్డును కొనసాగిస్తున్నారు. పట్టణానికి నడిబొడ్డున డంపింగ్ యార్డు ఉండడంతో వర్షం కురిస్తే, పరిసరాల్లో జనావాసాలకు దుర్గంధం వెదజల్లుతోంది. డంపింగ్ యార్డు సమీపంలో నివాసితులు అనేక పర్యాయాలు తమకు ఎదురవుతున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. వైసీపీ ప్రభుత్వం పట్టణ ప్రజల అభ్యర్థన మేరకు 2023లో అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి ఆనుకొని వున్న సర్వే నంబర్లు 67, 68లోని ప్రభుత్వ జాగా సుమారు 20 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని భావించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి నెల కాకముందే ఇచ్చిన మాట ప్రకారం ప్రజల ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డు తరలింపుపై చర్యలు చేపట్టడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చోడవరం
నియోజకవర్గం

వెంకన్నపాలెంలో విత్తనాల పంపిణీ

చోడవరం, జూన్ 25: మండలంలోని వెంకన్నపాలెం రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి రమణ, మాజీ సర్పంచ్ బూర వెంకటరమణ, నాయకులు జోల గంగరాజు, ఐతా రాము, సియ్యాద్రి జగదీశ్ పాల్గొన్నారు.

లక్కవరంలో 'నేను బడికిపోతా' ర్యాలీ

చోడవరం, జూన్ 25: మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల పరిధిలో మంగళవారం 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు సీతబాబు, శ్రీను, ఉపాధ్యాయులు స్వామి, శివగంగ, సురేష్, గంగాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి నాణ్యతపై పరీక్షలు చేయండి: ఎంపీడీవో

బుచ్చెయ్యపేట, జూన్ 25: తాగునీటి కారణంగా సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రక్షిత నీటి ట్యాంకులు, చేతి బోర్లు నుంచి నీటి నమూనాలు సేకరించి నాణ్యతను పరీక్షించాలని ఎంపీడీవో శ్రీకాంతాచార్యులు ఆదేశించారు. తన చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షా కాలం సీజన్ ప్రారంభమైనందున వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రై డే పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హరీష్, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్లలో వైద్య శిబిరం

రోలుగుంట, జూన్ 25: మండలంలోని అర్ల గ్రామంలో రెండో రోజు మంగళవారం కూడా వైద్య శిబిరం కొనసాగుతుంది. 'అర్లలో జ్వరాల విజృంభణ' అనే శీర్షికతో ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వైద్య శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు వైద్యాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలు, రక్త నమూనాలను సేకరించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా మందులను అందిస్తున్నారు. గ్రామ పరిసరాల్లో పరిశుభ్రతకు తగిన చర్యలు చేపట్టారు. జ్వరాలు తగ్గే వరకు శిబిరం కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు.

మోదకొండమ్మ ఆలయ వార్షికోత్సవం

బుచ్చెయ్యపేట, జూన్ 25: వడ్డాది పాత సినిమా హాలు వద్ద మోదకొండమ్మ దేవాలయ వార్షికోత్సవ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్యాండు మేళాలు, డప్పులతో అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, నైవేద్యాలతో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

'విద్య నేర్పిన పాఠశాలకు సేవలు అందించడం అదృష్టం'

రావికమతం, జూన్ 25: చదువుకున్న పాఠశాల జన్మనిచ్చిన తల్లిదండ్రులతో సమానమని, విద్య నేర్పిన పాఠశాలలోనే సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అదృష్టంగా భావించాలని కొత్తకోట ఎస్ఐ కె.లక్ష్మణరావు, ఎంఈవో సిహెచ్.తలుపులు పేర్కొన్నారు. టి.అర్జాపురం పాఠశాలలో చదువుకున్న ఇదే గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ఎంప్లాయిస్ అసోసియేషన్‌గా ఏర్పడి సమకూర్చిన నోట్ పుస్తకాలను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జాపురం ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్య నేర్పిన పాఠశాలను మరిచిపోకుండా సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులు ప్రయోజకులై మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త జి.రామారావు, అసోసియేషన్ సభ్యులు కె.సతీష్, వెంకటరమణ, వై.గణేష్, అంజి, అనిల్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి
» డీఎంహెచ్‌వో బాలాజీ

బుచ్చెయ్యపేట, జూన్ 25: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎంఎస్‌వీకే.బాలాజీ ఆదేశించారు. మంగళవారం వడ్డాది పీహెచ్‌సీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతో పాటు రికార్డులతో మందుల నిల్వలను, రిజిస్టర్‌లో నమోదైన సంతకాల మేరకు సిబ్బంది హాజరుశాతాన్ని తనిఖీలు చేశారు. అలాగే రోగులను అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శంకుతలదేవితో ఓపీ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై సమీక్షించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. డయేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తచర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, గ్రామాల్లో నిర్దేశిత సమయంలో నీటి ట్యాంకులు, చేతి బోర్లలో క్లోరినేషన్ చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం విలేకరులతో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ఆగస్టు 31న అన్ని పీహెచ్‌సీల్లో డయేరియా నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఓఆర్ఎస్, అవసరమైన వారికి జింక్ సిరప్ ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. సీజన్ వ్యాధులపై ఇంటింటా సర్వే చేపట్టి వైద్య సేవలు అందిస్తామని ఆయన తెలిపారు.


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

ప్రశాంతంగా వడ్డాది పంచాయతీ సమావేశం

సర్పంచ్, ఉప సర్పంచ్ జనసేనలో చేరడంతో
ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన
పోలీసులు అప్రమత్తం.. బందోబస్తు నిర్వహణ

బుచ్చెయ్యపేట, జూన్ 25: మారిన రాజకీయ సమీకరణల నైపథ్యంలో నిర్వహించిన వడ్డాది మేజరు పంచాయతీ సమావేశం తొలిసారిగా పోలీసుల బందోబస్తు మధ్య జరిగింది. వైసీపీ అనుయాయులుగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు సార్వత్రిక ఎన్నికల సమయంలో జనసేన పార్టీలో చేరిన విషయం తెలిసిందే. మంగళవారం పంచాయతీ సమావేశం నిర్వహణకు ఈవో లవరాజు కార్యవర్గ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరడంతో సమావేశంలో అనుసరించవలసిన విధానంపై ఆదివారం వైసీపీ నాయకులు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, పార్టీ నాయకులు దొండా కన్నబాబు, దొండా నారాయణమూర్తి, వార్డు సభ్యులు ముందుగా భేటీ అయ్యారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లపై ధ్వజమెత్తాలని సమావేశంలో వైసీపీ నాయకులు నిర్ణయించారు. దీంతో సమావేశంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకునే అవకాశం ఉందని సమాచారం అందడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. సమావేశంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా కొత్తకోట సీఐ లంక అప్పలనాయుడు, ఎస్ఐ డి.ఈశ్వరరావు పంచాయతీకి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సమావేశం ముగిసే వరకు పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయాల మహిళా పోలీసులతో కలిసి బందోబస్తు నిర్వహించారు. అయితే సర్పంచ్ కామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైసీపీకి చెందిన 12 మంది వార్డు సభ్యులు ఎజెండాలోని అంశాలను చర్చించడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. దీంతో పంచాయతీ అధికారులతో పాటు పోలీసు అధికారులు ఊపిరి తీసుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యవర్గ సభ్యులు... బందోబస్తులో సీఐ, ఎస్ఐ, మహిళా పోలీసులు


రావికమతంలో హోరున పడుతున్న వాన

ఈదురుగాలులతో భారీ వర్షం

రావికమతం/బుచ్చెయ్యపేట, జూన్ 25: ఉదయం నిప్పుల కుంపటిలా కాసిన ఎండతో ఉక్కిరిబిక్కిరైన జనం, మధ్యాహ్నం కురిసిన భారీ వానతో సేదదీరారు. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో మంగళవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం పూట తీవ్రమైన ఎండతో పాటు ఉక్కపోతతో గర్భిణులు, చిన్నారులు అల్లాడిపోయారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం నల్లటి మబ్బులతో కమ్ముకుని ఈదురగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ ఏడాదిలో ఇదే పెద్ద వర్షమని రైతులు అంటున్నారు. దీంతో పలు చోట్ల చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై విరిగిపడ్డాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ ఉద్యోగులు సాయంత్రానికి చెట్ల కొమ్మలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏదేమైనా భారీ వానతో జనం ఉపశమనం పొందారు.

వైద్య సేవలు మెరుగుపరచండి
» జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

రావికమతం, జూన్ 25: గ్రామాల్లో వైద్య సేవలను మెరుగుపరచాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు, డీపీఎంవో లూసికార్డియా, ఎస్‌వో రామచంద్రావు, డీపీహెచ్‌వో జగదీష్, డీపీహెచ్ఎన్‌వో నాగమణి సూచించారు. కొత్తకోట సచివాలయ-1, ఆరోగ్య కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బంది పనితీరు, రికార్డుల పరిశీలించారు. హెల్త్ క్లినిక్ ద్వారా రోగులు, గర్భిణులు, కిశోర్ బాలికలకు వైద్య పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారని ఆరా తీశారు. రక్తహీనత వల్ల జరిగే నష్టాలను వారికి వివరించారు. అలాగే ఆరోగ్య కేంద్రం నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి.రామారావు, రమణ, ఎర్రమ్మ పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న టీమ్

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

రావికమతం, మే 25: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్వతోముఖాభివృద్ధి కోరుకుంటూ అర్చకులు లక్ష్మణశర్మ, రామారావు ఆధ్వర్యంలో పంచామృతాలు, పలు మధుర ఫల రసాలతో అభిషేకాలు, పుష్పార్చన, విశేష సుగంధ ద్రవ్యాలతో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల
నియోజకవర్గం


అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, భక్తులు

వైభవంగా పరదేశమ్మ జాతర

దేవరాపల్లి, జూన్ 25: మండలంలోని రైవాడ శివారు శంబువానిపాలెంలో పరదేశమ్మ గ్రామ దేవత ఒడ్డు పండగ మంగళవారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. పొలాల గట్ల మీదుగా నడచుకుంటూ ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీడీపీ అనకాపల్లి పార్లమెంటు ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, నాయకులు సూర్యనారాయణ, చల్లా తాతయ్యలు, కోటిపల్లినాయుడు, పోతల పాత్రునాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మోదకొండమ్మకు ఘనంగా పూజలు

మాడుగుల, జూన్ 25: మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయం వెనుక భాగంలోని వంట షెడ్డు, పంట పొలాల్లో భక్తులు వంటలు చేసుకుని భోజనాలు ఆరగించారు.


భక్తుల పూజలు అందుకున్న అమ్మవారు

జాజులపాలెంలో జ్వరాలు

చీడికాడ, జూన్ 25 : మండలంలోని కోనాం శివారు జాజులపాలెం గిరిజన గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో మంగళవారం చీడికాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో జన్ని ఉమ, కాకర లక్ష్మి, బొద్దంకి అచ్చియ్యమ్మలు జ్వరాలతో బాధపడుతుండగా, మరికొంతమంది ఆ లక్షణాలతో బాధపడుతున్నారు. వైద్య శిబిరంలో 35 మందికి తనిఖీలు చేయగా.. వీరిలో పది మందికి రక్తపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఈ శిబిరంలో కోనాం సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, భానుప్రసాద్, ఆశవర్కర్‌లు సేవలు అందించారు.